క్లుప్తంగా

నేడు మెగా జాబ్‌మేళా

జహీరాబాద్: పట్టణంలో ఈ నెల 7న బీబీ పాటిల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు డీఆర్‌యూసీసీ సభ్యుడు షేక్ ఫరీద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని శెట్కార్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్న మేళాను మంత్రి హరీశ్‌రావు ప్రారంభిస్తారని, జాబ్‌మేళాలో 50 ప్రముఖ కంపెనీలు పాల్గొంటాయన్నారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

గొంగ్లూర్ గ్రామస్తుల కృషి అభినందనీయం

పుల్‌కల్(అందోల్): ఐక్యతతో అభివృద్ధి సాధించవచ్చని గొంగ్లూరు గ్రామస్తులు రుజువు చేశారని కలెక్టర్ శరత్ అన్నారు. మండల పరిధిలోని గొంగ్లూర్ గ్రామంలో వాణిజ్య పన్నుల శాఖ అధికారులు దత్తత తీసుకుని నిర్మించిన క్రీడాప్రాంగణాన్ని ఐటీ అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వాణిజ్య పన్నుల శాఖ అధికారులు ఐదేళ్ల క్రితం గొంగ్లూర్ గ్రామాన్ని దత్తత తీసుకుని మహిళల ఆర్థిక స్వావలంబనకు కృషి చేశారన్నారు. అంతేకాకుండా గ్రామంలో సమావేశాల నిర్వహణకు గాంధీ గ్రామసేవ భవనం నిర్మించి గ్రామస్తులకు అంకితం చేశారన్నారు. మహిళల భాగస్వామ్యంతో నూనెలు, పప్పుల తయారు పరిశ్రమను నెలకొల్పారని సూచించారు. గ్రామస్తులు ఐక్యంగా ఉండటంతోనే జిల్లా స్థాయిలో గ్రామానికి గుర్తింపు వచ్చిందని వివరించారు. కార్యక్రమంలో వాణిజ్య పన్నుల శాఖ ఐఆర్‌ఎస్ మితాలీ మధుస్మిత, సంజయ్ బహదూర్, వీకే గుప్తా, కేవీఎస్ చార్య, అదనపు కలెక్టర్ మాధురి పాల్గొన్నారు.

8 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 8 మంది వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించింది. పటాన్‌చెరు ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బుధ, గురువారాల్లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 8 మందిని అదుపులోకి తీసుకొని శుక్రవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా జడ్జి ఒక్కొక్కరికి రూ.2వేల చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ తెలిపారు.

'సంక్షేమంలో తెలంగాణ ఆదర్శం'



కోహీర్‌లో కమ్యూనిటీ హాల్ భవనానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

కోహీర్(జహీరాబాద్): అభివృద్ధి, సంక్షేమంలో తెలంగాణ రాష్ట్ర ఆదర్శంగా నిలుస్తోందని జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు అన్నారు. కోహీర్ పట్టణంలోని సంజయ్‌నగర్ కాలనీలో కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం దశలవారీగా నిధులు మంజూరు చేస్తూ అనేక అభివృద్ధి పనులను చేపడుతోందన్నారు. బీఆర్‌ఎస్ బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని సూచించారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు నర్సింహులు యాదవ్, నాయకులు శుభాష్‌రెడ్డి, వహీద్, వెంకట్ రాంరెడ్డి, కలీం, జావేద్, సంపత్ కుమార్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

జహీరాబాద్: మండల పరిధిలోని రాయిపల్లి గ్రామంలో అంబేడ్కర్ మినీ ఫంక్షన్ హాల్ నిర్మాణం, హుగ్గెల్లిలో పంచాయతీ భవనం, కొత్తూర్‌లో కమ్యూనిటీ భవనాన్ని ఎమ్మెల్యే మాణిక్‌రావు శుక్రవారం ప్రారంభించారు. టీఎస్ రేజస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవిప్రసాద్, సర్పంచ్ జగన్మోహన్, ఆత్మచైర్మన్ పెంటారెడ్డి, ఎంపీడీఓ సుమతి, నాయకులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమమే ప్రభుత్వం లక్ష్యం

జిన్నారం(పటాన్‌చెరు): మత్స్యకారుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని జెడ్పీవైస్ చైర్మన్ ప్రభాకర్ అన్నారు. జిన్నారం మండల కేంద్రంలో మత్స్యకారులకు శుక్రవారం చేపపిల్లలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకారులు ఆర్థికంగా అభివృద్ధి చెందడమే లక్ష్యంగా ప్రభుత్వం చేప పిల్లలను పంపిణీ చేస్తోందని వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ రవీందర్‌గౌడ్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డీఎస్పీకి ఎన్‌ఎస్‌యూఐ నాయకుల ఫిర్యాదు

నారాయణఖేడ్: ఏఐసీసీ కార్యదర్శి, ఎన్‌ఎస్‌యూఐ ఇన్‌చార్జి కన్నయ్యకుమార్‌పై న్యూస్18 యాంకర్ అమీష్‌దేవగన్ అబద్ధపు, అసత్యపు కథనాలను ప్రసారం చేశారని ఆరోపిస్తూ అతడిపై ఎన్‌ఎస్‌యూఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ఖేడ్ నియోజకవర్గ అధ్యక్షుడు దిలీప్‌రెడ్డి, నాయకులు శశికాంత్‌రెడ్డి, బీరప్ప, కురుమ సంగ్రాం శుక్రవారం ఖేడ్ డీఎస్పీ వెంకట్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమీష్‌దేవగన్‌పై కేసు నమోదు చేసి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

అన్నివర్గాల అభ్యున్నతికి కృషి

- ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి
- అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నారాయణఖేడ్: అన్నివర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని 4, 12, 13, 14 వార్డుల్లో రూ.10కోట్ల టీయూఎఫ్‌ఐడీసీ నిధులతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు శుక్రవారం శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ బలోపేతమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు మరింత కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఖేడ్ మండలంలోని వెంకటాపూర్, కిషన్‌నాయక్ తండా, నర్సాపూర్, సంజీవన్‌రావు పేట్, ర్యాలమడుగు, మాణిక్‌నాయక్ తండా, నమ్లిమేట్, బంద్రాన్‌పల్లి, అనంతసాగర్, సత్యగామ, జూకల్, జగన్నాథ్‌పూర్ గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసి పలుచోట్ల బతుకమ్మ చీలను పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రుబీనానజీబ్,



నారాయణఖేడ్: శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

వైస్ చైర్మన్ పరశురాం, మేనేజర్ వెంకటశివయ్య, జెడ్పీటీసీ లక్ష్మీబాయి, సీడీపీఓ సుజాత, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రాంరావు మహారాజ్ అడుగుజాడల్లో నడవాలి

కల్హేర్(నారాయణఖేడ్): గిరిజనుల ఆరాధ్యదైవం తపస్వీ సంత్‌శ్రీ డాక్టర్ రాంరావు మహారాజ్ అడుగుజాడల్లో నడవాలని ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. సిర్గాపూర్ మండలంలోని జీవుల తం



కల్హేర్: రాంరావు విగ్రహావిష్కరణలో పాల్గొన్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, నాయకులు

డాలో గిరిజన గురువు ప్రేమ్‌సింగ్ మహారాజ్‌తో కలిసి రాంరావు మహారాజ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దివ్యభారతిచరణ్, ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, బంజారా సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్‌చౌహాన్, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే గ్రామాల అభివృద్ధి

పటాన్‌చెరు: బీఆర్‌ఎస్‌తోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తెలిపారు. పటాన్‌చెరు మండలం ఇంద్రేశం గ్రామ పరిధిలోని పీఎస్‌ఆర్ టౌన్‌షిప్‌లో జీవీఆర్ ఎంటర్‌ప్రైజెస్ సంస్థ సహకారంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఆర్‌కే-వన్ కాలనీలో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్నివర్గాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని వివరించారు. అనంతరం మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. అదేవిధంగా ఐనోలు గ్రామ చౌరస్తాలో ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఎంపీపీ సుష్మా శ్రీ, జెడ్పీటీసీ సుప్రజ, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ధీరత్వానికి నిదర్శనం ఛత్రపతి శివాజీ

జిన్నారం(పటాన్‌చెరు): ధీరత్వానికి నిదర్శనం ఛత్రపతి శివాజీ అని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని నల్తూర్ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని శుక్రవారం ఆవిష్కరించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహనీయుల చరిత్రను భావి తరాలకు వివరించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. అనంతరం ఎమ్మెల్యేను గజమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ ప్రభాకర్, సర్పంచ్ జనార్దన్, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



ఇంద్రేశంలో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

హామీలను అమలు చేస్తున్నాం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని జిల్లా పరిషత్ పాఠశాలలో కేసీఆర్ అల్పాహార పథకాన్ని శుక్రవారం ప్రారంభించారు. అనంతరం మున్సిపాలిటీ పరిధిలోని వివిధ కాలనీలలో చేపట్టిన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయాన్నే పాఠశాలలకు వచ్చే పిల్లలు ఆకలితో అలమటించకూడదన్న ఉద్దేశ్యంతో సీఎం కేసీఆర్ ఈ పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. నియోజకవర్గంలోని 158 ప్రభుత్వ పాఠశాలలో 25,861 మంది విద్యార్థులకు ఈ పథకం ద్వారా అల్పాహారాన్ని అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ లలితాసోమిరెడ్డి, వైస్ చైర్మన్ రాములుగౌడ్, కమిషనర్ శ్రీనివాస్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

క్రీడారంగానికి ప్రభుత్వం పెద్దపీట

- రాష్ట్ర చేనేత సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): క్రీడారంగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రాష్ట్ర చేనేత సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్ అన్నారు. మండల పరిధిలోని వెల్టూర్ గ్రామంలో క్రీడా ప్రాంగణాలకు స్పోర్ట్స్ కిట్స్, మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రతి గ్రామంలో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసిందన్నారు. ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించేందుకు సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ బుచ్చిరెడ్డి, ఎంపీపీ యాదమ్మ, ఎంపీడీఓ పూజ, పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రెడ్డి, సర్పంచ్ లక్ష్మారెడ్డి, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

బతుకమ్మ చీరల పంపిణీ

కంది(సంగారెడ్డి): తెలుగింటి ఆడపడుచులు పండుగను సంతోషంగా జరుపుకోవాలనే ఉద్దేశ్యంతో



యువకులకు స్పోర్ట్స్ కిట్స్‌ను పంపిణీ చేస్తున్న చింతా ప్రభాకర్

ప్రభుత్వం బతుకమ్మ చీరల పంపిణీ చేస్తోందని రాష్ట్ర చేనేత సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్ అన్నారు. కందిలో శుక్రవారం బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సరళాపుల్లారెడ్డి, జెడ్పీటీసీ కొండల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రభుగౌడ్, ఆత్మకమిటీ చైర్మన్ కృష్ణగౌడ్, వైస్ ఎంపీపీ లక్ష్మణ్‌గౌడ్, సర్పంచ్ విమలావీరేశం, ఉపసర్పంచ్ ఖాజా తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఎంటీటీఎస్ శిక్షణ

సంగారెడ్డి అర్బన్: జాతీయ స్థాయి మ్యాథమెటిక్స్ ట్రైనింగ్ టాలెంట్ సెర్చ్ (ఎంటీటీఎస్) శిక్షణకు తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎంపిక కావడం గర్వకారణమని కళాశాల ప్రిన్సిపాల్ రత్నప్రసాద్ తెలిపారు. కళాశాలలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఎంఎంటీఎస్ శిక్షణ శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణితశాస్త్రంపై డిగ్రీ విద్యార్థుల్లో ఆసక్తి పెంపొందించడమే లక్ష్యంగా శిక్షణ కొనసాగిందన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని శివనాడార్ విశ్వవిద్యాలయానికి చెందిన సత్యనారాయణరెడ్డి, త్రిపుర విశ్వవిద్యాలయానికి చెందిన భట్టాచార్య ప్రధాన వక్తలుగా వ్యవహరించారని తెలిపారు. ఈ శిక్షణను తమ కళాశాలలో నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రవీణ, (ఐక్యూఏసీ) కన్వీనర్ విశ్వేశ్వర్‌శర్మ, గణితశాస్త్ర అధ్యాపకులు అనిల్‌కుమార్, లింగస్వామి, భావన, సునీత, వెంకటేశం, సుధారాణి, నాగరాజు వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య కమిటీ ఎన్నిక

సంగారెడ్డి: ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య జిల్లా కమిటీని సెయింట్ ఆంటోని డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ప్రశాంత్‌కుమార్, వెంకటేశం, ఉపాధ్యక్షులుగా విఠల్, విష్ణువర్ధన్ రెడ్డి, రామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా అంతోనిరెడ్డి, కోశాధికారిగా నాగేశ్వరరావు, సంయుక్త కార్యదర్శులుగా నాగిరెడ్డి, ప్రమోద్, వర్కింగ్ ప్రెసిడెంట్స్‌గా అంతోనిరెడ్డి, శ్రీశైలం, జగన్మోహన్, సభ్యులుగా మహిపాల్ రెడ్డి, వనజరెడ్డి ఎన్నికయ్యారు.

విద్యార్థులకు వరం.. సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకం

జహీరాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సీఎం కేసీఆర్ ప్రారంభించిన బ్రేక్ ఫాస్ట్ పథకం వరం లాంటిదని ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నరోత్తం అన్నారు. శుక్రవారం జహీరాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని ప్రారంభించారు. డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, ఆర్డీఓ వెంకారెడ్డి, తహసీల్దార్ రవీందర్, మున్సిపల్ కమిషనర్ మల్లారెడ్డి, ఎంఈఓ బస్వరాజ్ పాల్గొన్నారు.

నారాయణఖేడ్: జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థినులకు అల్పాహారం పంపిణీ కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ రుబీనా నజీబ్ ప్రారంభించారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం పాఠశాలల్లో అల్పాహారం పంపిణీ పథకాన్ని ప్రవేశపెట్టినట్లు తెలిపారు. జెడ్పీటీసీ లక్ష్మీబాయి, ఆర్డీఓ వెంకటేష్, తహశీల్దార్ దేవదాస్, సీడీపీవో సుజాత, మున్సిపల్ మేనేజరు వెంకటశివయ్య తదితరులు పాల్గొన్నారు.



వట్‌పల్లి: జోగిపేట ప్రభుత్వ పాఠశాలలో అల్పహారం వడ్డిస్తున్న ఎమ్మెల్యే క్రాంతి

రెండో విడత గొర్రెలను పంపిణీ చేయాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

సంగారెడ్డి: రెండో విడత గొర్రెలను వెంటనే పంపిణీ చేయాలని గొర్లకాపరుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు బాపు మల్‌శెట్టి మాట్లాడుతూ మూడేళ్ల నుంచి డీడీలు చెల్లించిన లబ్దిదారులకు ఇప్పటివరకు గొర్రెలను పంపిణీ చేయడంలేదన్నారు. జిల్లాలో లబ్దిదారులు 11,832 మంది ఎంపికయ్యారన్నారు. అందులో డీడీలు చెల్లించిన వారు 5620 మంది ఉండగా ఇప్పటివరకు జిల్లాలో 1100 మందికి మాత్రమే గొర్రెలను పంపిణీ చేయగా మిగతావారి పరిస్థితి అయోమయంగా ఉందన్నారు. మున్సిపాలిటీ పరిధిలో ఉన్న గొల్ల,కురుమలకు ఈ పథకాన్ని అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ గొర్రెల మేకల పెంపకందారులు సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఒడ్డే ఓబన్న సేవలు మరువలేనివి

- ఎన్‌ఎంఆర్ యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు నీలం మధు

పటాన్‌చెరు టౌన్: బీసీల అభ్యున్నతికి కృషి చేసిన ఒడ్డే ఓబన్న సేవలు మరువలేనివని ఎన్‌ఎంఆర్ యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు నీలం మధు ముదిరాజ్ అన్నారు. పటాన్‌చెరు మండలంలోని చిట్కుల్ గ్రామంలో ఎన్‌ఎంఆర్ యువసేన కార్యాలయంలో వడ్డే ఓబన్న వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో వార్డుసభ్యులు వెంకటేశ్, మురళి, రాజ్‌కుమార్, ఈశ్వర్, దస్తగిరి, ఎల్లప్ప, రాజు, జగదీష్, కృష్ణ యువసేన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న నీలం మధు

బతుకమ్మ చీరలు పంపిణీ

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ పరిధిలో మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి, కమిషనర్ సంగారెడ్డి, కౌన్సిలర్ చంద్రారెడ్డి శుక్రవారం బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. అదేవిధంగా శివానగర్‌లో జెడ్పీవైస్ చైర్మన్ ప్రభాకర్ మహిళలకు చీరలను అందజేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

రామచంద్రాపురంలో..

రామచంద్రాపురం(పటాన్‌చెరు): దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణలో అన్ని పండుగలను అధికారికంగా నిర్వహిస్తున్న ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే చెందుతుందని భారతినగర్ డివిజన్ కార్పొరేటర్ సింధురెడ్డి తెలిపారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని ఎంఐజీ కాలనీలో బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు.



చీరలను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ సింధురెడ్డి

న్యాల్‌కల్‌లో..

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని మల్గి, న్యాల్‌కల్, టేకూర్ తదితర గ్రామాల్లో ఆయా గ్రామాల సర్పంచ్‌లు మారుతి యాదవ్, అమీర్ శుక్రవారం బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.



2వ వార్డులో పిచికారీ చేస్తున్న కార్మికులు



దర్గావీధిలో బ్లీచింగ్ ఫౌడర్ చల్లుతున్న కార్మికుడు

సాక్షి ఎఫెక్ట్...

మురుగుకాలువలు శుభ్రం

నారాయణఖేడ్: 'సాక్షి' దినపత్రిక ఆధ్వర్యంలో నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమంలో భాగంగా వచ్చిన ఫిర్యాదులపై స్పందించిన మున్సిపల్ అధికారులు శుక్రవారం పట్టణంలోని 2వ వార్డులో దోమల నివారణకు పిచికారీ చేపట్టారు. నెహ్రూనగర్, కాశీనాథ్‌మందిర్, 15వ వార్డు, సరస్వతీ శిశుమందిర్ కాలనీ, రాంమందిర్, దర్గావీధిలోని మురుగు కాలువల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. ఇందిరానగర్ కాలనీ, శివాజీ చౌక్, ఎడ్ల బజార్, ఇత్వార్‌పేట్, దత్తాత్రేయ కాలనీ, రహమాన్ కాలనీల్లో దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టారు.

అలరించిన బ్యూటీషియన్ల ఫ్యాషన్ షో



సర్టిఫికెట్లతో శిక్షణ పూర్తిచేసుకున్న మేకప్ ఆర్టిస్టులు, బ్యూటీషియన్లు

జహీరాబాద్: పట్టణంలోని ఇంద్రప్రస్థ కాలనీలోని క్లబ్‌హౌజ్‌లో శుక్రవారం నిర్వహించిన ఫ్యాషన్ షో అలరించింది. గత మూడు నెలల పాటు సంగారెడ్డిలోని మహిళా ప్రాంగణం, జహీరాబాద్‌లోని లతాస్‌బ్యూటీ హబ్ ఆధ్వర్యంలో 50 మంది మహిళలకు ఉచిత మేకప్, కుట్టు శిక్షణ ఇచ్చారు. వీరి శిక్షణ పూర్తయిన సందర్భంగా మేకప్ ఆర్టిస్టులు, బ్యూటీషియన్లు ఫ్యాషన్ షో ప్రదర్శించారు. శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు, ఫ్యాషన్ షో విజేతలకు డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్ బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణ పొందిన వారు ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకొని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. ఫ్యాషన్‌షోలో ప్రథమ బహుమతి శివానీ, ద్వితీయ బహుమతి స్రవంతి, తృతీయ బహుమతి సుప్రియలు దక్కించుకున్నారు. కార్యక్రమంలో మహిళా ప్రాంగణం అధికారి సుకన్య, శిక్షకులు లత, ఆర్గనైజర్ రవి, జడ్జిలుగా వ్యవహరించిన అన్నపూర్ణ, వినయపాటిల్, శానుబాయి, పద్మ పాల్గొన్నారు.

ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

వట్‌పల్లి(అందోల్): 12 రోజులుగా ఆశావర్కర్లు నిరవధిక సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని సీఐటీయూ అందోల్ డివిజన్ కార్యదర్శి విద్యాసాగర్ అన్నారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట రాస్తారోకో చేపట్టారు. కార్యక్రమంలో ఆశావర్కర్ల యూనియన్ జిల్లా కార్యదర్శి యశోద, జిల్లా సహాయ కార్యదర్శి సంగీత, నాయకురాలు మరియమ్మ గంగమ్మని, మాధవి, రేణుక, శిరీష, మానెమ్మ, నందిని, లావణ్య పాల్గొన్నారు.

ఆశావర్కర్ల వంటావార్పు

సంగారెడ్డి టౌన్: ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలని చేపట్టిన సమ్మెలో భాగంగా శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట వంటావార్పు నిర్వహించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు, నాయకులు యాదగిరి, వరలక్ష్మీ, వీరమణి, శారద, సునీత పాల్గొన్నారు.



రాస్తారోకో నిర్వహిస్తున్న ఆశావర్కర్లు



వంటావార్పు నిర్వహిస్తున్న ఆశావర్కర్లు

సంక్షిప్త వార్తలు

◆ సమస్యల పరిష్కారానికి కృషి

పటాన్‌చెరు టౌన్: డివిజన్ పరిధిలోని వివిధ కాలనీలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు కార్పొరేటర్ కుమార్‌యాదవ్ అన్నారు. పట్టణంలోని ఎంజీ రోడ్డు, చైతన్యనగర్, సీతారామపురంకాలనీలో శుక్రవారం పర్యటించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేష్, కాలనీవాసులు పాల్గొన్నారు.

◆ జోగిపేట డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా రమేశ్

వట్‌పల్లి(అందోల్): జోగిపేట నెహ్రూ మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పూర్తిస్థాయి ప్రిన్సిపాల్‌గా డాక్టర్ రమేష్ శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. ఖమ్మంలోని ఎస్‌ఆర్ అండ్ బీజీఎన్‌ఆర్ ఆర్ట్స్, సైన్స్ కళాశాలలో అసోసియేట్ ప్రొఫెసర్ ఆఫ్ కెమిస్ట్రీగా రమేశ్ పనిచేశారు. విద్యాశాఖ ఇటీవల జరిపిన పదోన్నతులలో భాగంగా జోగిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా నియమితులయ్యారు. ఇప్పటివరకు ఇన్‌చార్జీ ప్రిన్సిపాల్‌గా పని చేసిన డాక్టర్ అడవి రాజు నుంచి బాధ్యతలు స్వీకరించారు.

◆ డ్రైనేజీ పైప్‌లైన్ లీకేజీలు అరికట్టాలి

సంగారెడ్డి టౌన్: డ్రైనేజీ పైప్ లైన్ లీకేజీలను అరికట్టాలని ఫోరం ఫర్ బెటర్ సంగారెడ్డి అధ్యక్షుడు శ్రీధర్ మహేంద్ర అన్నారు. సంగారెడ్డిలోని బైపాస్ రోడ్డు బసవేశ్వర విగ్రహం పక్కన ఉన్న హౌసింగ్ బోర్డ్ కాలానికి చెందిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైప్ లైన్ లీకేజీ కావడంతో కొన్ని నెలలుగా డ్రైనేజీ మురుగునీరు రోడ్డుపై పారుతుందన్నారు. అధికారులు స్పందించి పైప్‌లైన్‌లకు మరమ్మతులు చేపట్టాలని కోరారు.

◆ ఆత్మగౌరవ సభ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

పటాన్‌చెరు టౌన్: ముదిరాజ్ సామాజికవర్గానికి శాసనసభ స్థానాల్లో అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ ముదిరాజ్ సంఘం రాష్ట్ర నాయకులు, మాజీ కార్పొరేటర్ సపానాదేవ్ ఆధ్వర్యంలో శుక్రవారం పటాన్‌చెరు పట్టణంలోని ముదిరాజ్ భవన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ నెల 8న పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న ముదిరాజ్‌ల ఆత్మగౌరవ సభకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు టప్ప కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

◆ భూములను లాక్కోవటం సరైందికాదు

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారంలోని సర్వేనంబర్ 1లో హెచ్‌ఎండీఏ అధికారులు తమకు సమాచారం లేకుండా బలవంతంగా భూములను లాక్కునేందుకు సర్వేలు నిర్వహిస్తున్నారని ఆరోపిస్తూ రైతులు శుక్రవారం తహశీల్దార్ రవికుమార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రైతులకు న్యాయం చేసేవిధంగా చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు.

◆ షోకాజు నోటీసులకు వివరణ

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని గడ్డపోతారంలో ఇళ్ల నిర్మాణం లేకున్నా ఇంటి నంబర్లను కేటాయించే విషయంలో సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డుసభ్యులు వివరణ ఇవ్వాలని ఇటీవల కలెక్టర్ ఆదేశించగా వార్డుసభ్యులు వీరేశం, శివశంకర్ తదితరులు శుక్రవారం డీపీఓకు లిఖితపూర్వక వివరణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటి నంబర్ల కేటాయింపు విషయంలో తమకు ఎలాంటి సమాచారం లేదని స్పష్టం చేశారు.

◆ ఎల్‌ఓసీ అందజేత

సంగారెడ్డి: అందోల్ నియోజకవర్గం చౌటకూర్ మండలంలోని శివంపేట్ గ్రామానికి చెందిన సోలక్కంపల్లి విశ్వనాథ్‌కు రూ.2.50లక్షల ఎల్‌ఓసీని అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ శుక్రవారం క్యాంప్ కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షులు అలీమ్, మాజీ సర్పంచ్ గోపాల్, సంతోష్, రాజు, రాజేందర్, అశోక్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

◆ మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా

సంగారెడ్డి టౌన్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్ కార్యాలయం ఎదుట మధ్యాహ్న భోజన కార్మికులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 25 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్నా ఈఎస్‌ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించడంలేదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు.

◆ భూగర్భ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన

రామచంద్రాపురం(పటాన్‌చెరు): డివిజన్ పరిధిలోని శ్రీనివాసనగర్ కాలనీలో భూగర్భ డ్రైనేజ్ పనులకు కార్పొరేటర్ పుష్పనగేష్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పనులను త్వరగా పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు, అధికారులకు సూచించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.